## క్లుప్తంగా

### నేటి నుంచి గ్రామ దేవత మహోత్సవాలు

**పాతపట్నం:** ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు మండలంలోని బూరగాంలో జడ్డమ్మ గ్రామ దేవత మహోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతీ ఐదేళ్లకు ఒకసారి జరగావల్సిన ఉత్సవాలు.. ఈ సారి ఏడేళ్లకు నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. శ్రీకాకుళం-పాతపట్నం ప్రధాన జాతీయ రహదారికి ఇరువైపులా గ్రామం వరకు విద్యుత్ దీపాలను అలంకరించారు. సిరిమాను తిరిగే సమయంలో ట్రాఫిక్‌ను అదుపు చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

### నేటి నుంచి ఆలయ ప్రతిష్ట ఉత్సవాలు

**నరసన్నపేట:** మండలంలోని రెడ్డికిపేట సమీపంలో పునర్ నిర్మించిన హలహలేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమాలు ఈ నెల 2వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. సోమవారం సాయంత్రం తిరువీధి ఉత్సవంతో ప్రతిష్ట కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు కమిటీ సభ్యులు ఎంపీపీ ఆరంగి మురళి, శిమ్మ లక్ష్మణరావు, అల్లు అసిరినాయుడు, అవ్వ రవీంద్ర ఆదివారం తెలిపారు. 5న విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నామన్నారు. అనంతరం అన్న సంతర్పణ ఉంటుందన్నారు. ఈ నాలుగు రోజుల్లో వివిధ పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. ఆలయ ప్రాంగణంలో నవగ్రహ, అభయాంజనేయ విగ్రహాలు ప్రతిష్ట చేస్తామన్నారు.

### ఏపీఎస్పీ హెచ్‌సీ మృతికి సంతాపం


గౌరినాయుడు (ఫైల్)

**ఎల్.ఎన్.పేట:** మండలంలోని చింతలబడవంజ గ్రామానికి చెందిన ఏపీఎస్పీ హెడ్ కానిస్టేబుల్ పనస గౌరినాయుడు (47) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విజయనగరం ఏపీఎస్పీ 5వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. చింతలబడవంజలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. గౌరినాయుడుకు భార్య భవాని, కుమారుడు నిఖిల్, కుమార్తె మైథిలి ఉన్నారు. హెచ్‌సీ మృతి పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

### చాపరలో కార్డెన్ సెర్చ్


చాపరలో స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

**మెళియాపుట్టి:** చాపర గ్రామంలో పోలీసులు ఆదివారం తెల్లవారి జామున కార్డెన్ సెర్చ్ నిర్వహించాడంతో ప్రజలు ఉలిక్కి పడ్డారు. ఎస్ఐ రమేష్ బాబు అధ్వర్యంలో పోలీసులు చాపర గ్రామంలోని గొల్లవీధి, రెల్లివీధిలో వాహనాలకు ధ్రువపత్రాలు ఉన్నాయా? లేదా అని ఆరా తీశారు. ఎటువంటి ధ్రువపత్రాలు లేని 7 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రతీ గ్రామంలోని ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తామని, ధ్రువపత్రాలు చూపించాలన్నారు. పలువురు పోలీసులు పాల్గొన్నారు.

### యాజమాన్య పద్ధతులు పాటించాలి

**బూర్జ:** వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని కేవీకే శాస్త్రవేత్త చింతాడ బాలకృష్ణ అన్నారు. మండలంలోని గుత్తావల్లి గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులతో ఆదివారం సమావేశం నిర్వహించి సాంకేతిక వ్యవసాయ పోకడలపై అవగాహన కల్పించారు. సాగులో విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్య పద్ధతులు కీలకమన్నారు. ముందు తట్టుకొనే విత్తనాలు వేసుకోవాలని సూచించారు. వ్యవసాయంతోపాటు అనుబంధరంగాలైన పశు పోషణ, కోళ్లు, చేపల పెంపకం, కూరగాయల సాగు వలన ఆదాయాభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ శైలజ, డాక్టర్ కిరణ్ గాంధీ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పాల్గొన్నారు.

# రేషన్ కష్టాలు.. మళ్లీ ప్రారంభం

- రేషన్ డిపోల వద్ద క్యూలు
- కూటమి ప్రభుత్వ నిర్ణయంతో గొల్లుమంటున్న కార్డుదారులు
- ఇదేమి పద్ధతి అని మండిపాటు
- సర్వర్ సమస్యతో గంటల తరబడి పడిగాపులు
- ఎండలో గిరిజనుల అవస్థలు



పాతపట్నం: తంబేసుపేటలో రేషన్ కోసం వేచి ఉన్న కార్డుదారులు

**ఎల్.ఎన్.పేట/నరసన్నపేట/ఆమదాలవలస:** గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలకు కోతలు విధిస్తూ వస్తున్న కూటమి ప్రభుత్వం తాజాగా రేషన్ సరుకులను డీలర్ల వద్దే తీసుకోవాలని ఆదేశించడంతో కార్డుదారులు కష్టాలు మొదలయ్యాయి. ఎండీయూ వాహనం రద్దు చేసి జూన్ ఒకటి నుంచి డిపోల వద్దే సరుకులు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించించిన విషయం విదితమే. దీంట్లో భాగంగా ఆదివారం కూటమి నాయకులు రేషన్ డిపోల వద్ద ఆర్భాటంగా సరుకులు పంపిణీ ప్రారంభించారు. అక్కడికి కొద్ది నిమషాల్లోనే కార్డుదారుల కష్టాలు ప్రారంభమయ్యాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే ఎండీయూ వాహనం రాగా.. ఎటువంటి ఇబ్బంది లేకుండా సరుకులు తీసుకొనేవారు. వలంటీర్లు స్వయంగా ఫోన్లు చేసి కార్డుదారులకు అలర్ట్ చేసేవారు. మొదటి రోజునే కార్డుదారులు నరకం చూశారు. ఇదేమి పద్ధతి అని మహిళలు రేషన్ డిపో వద్ద మాట్లాడుకుంటున్నారు. దీనికి సర్వర్ సమస్య తోడు కావడంతో ఒక్కో కార్డుదారుడు బియ్యం తీసుకోవడానికి కనీసం గంటల సమయం పట్టింది. రోజంతా ఇదే పరిస్థితి కొనసాగింది.


ఆమదాలవలస: గేటు ప్రాంతంలో మండుటెండలో రేషన్ సరుకులు భుజంపై మోసుకువెళ్తున్న మహిళ

#### ఇబ్బందులు ప్రారంభం



రేషన్ వాహనాలు రద్దు చేయడం పెద్ద తప్పు. దీని వలన కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. ఎక్కడో దూరంగా ఉన్న డీలర్ వద్దకు సరుకులు కోసం పనులన్నీ పక్కన పెట్టి క్యూలు కట్టాల్సిన పరిస్థితి. డీలర్ల వ్యవస్థ వలన సరుకుల పంపిణీలో కూడా అవకతవకలు జరిగే అవకాశాలున్నాయి.
– పైడి మోహనరావు, మతలబుపేట, సరుబుజ్జిలి

| పాతపట్నం నియోజకవర్గంలో రేషన్ డిపోలు, కార్డుల వివరాలు.. | | |
|---|---|---|
| మండలం | రేషన్ డిపోలు | కార్డులు |
| పాతపట్నం | 47 | 18,980 |
| ఎల్.ఎన్.పేట | 36 | 10,961 |
| హిరమండలం | 31 | 12,241 |
| కొత్తూరు | 61 | 22,634 |
| మెళియాపుట్టి | 44 | 16,675 |
| **నరసన్నపేట నియోజకవర్గం** | | |
| నరసన్నపేట | 53 | 23,537 |
| పోలాకి | 50 | 21,307 |
| సారవకోట | 45 | 16,485 |
| జలుమూరు | 53 | 19,217 |
| **ఆమదాలవలస నియోజకవర్గం** | | |
| ఆమదాలవలస | 78 | 25,835 |
| బూర్జ | 49 | 13,601 |
| పొందూరు | 62 | 22,775 |
| సరుబుజ్జిలి | 40 | 9,900 |

#### మూడు గంటలపైనే పట్టింది



పనులు మానుకొని వచ్చాం.. వంట వేసుకోలేదు. వచ్చి మూడు గంటలపైనే అవుతుంది. ఇప్పటి వరకు బియ్యం అందలేదు. ఇంకెంత సమయం పడుతుందో తెలీదు. ఇలా మాకు కష్టాలు పెట్టడం బాగులేదు. సౌకర్యాలు పెంచాలి గానీ.. ఉన్న సౌకర్యాలు కత్తిరించి కష్టాలు పెట్టడం అన్యాయం. బియ్యం పంపిణీలో గత ప్రభుత్వం అమలు చేసిన పద్ధతే బాగుంది.
– ఆర్.చంద్రమ్మ, సత్యవరం కాలనీ, నరసన్నపేట


నరసన్నపేట: కలివరపుపేట డిపో వద వేచివున్న కార్డుదారులు


నరసన్నపేట: పెద్దపేట డిపో వద్ద క్యూలో ఉన్న కార్డుదారులు

#### పనులు మానుకుని వెళ్లాను..



కూలి పని మానుకుని రేషన్ బియ్యం కోసం వెళ్లాల్సి వచ్చింది. ఈ రోజు బియ్యం కోసం వెళ్లి రోజంతా అక్కడే ఉండిపోయాను. పొలం పనికి వెళ్లే రూ.500 కూలి డబ్బులు వచ్చేవి. మూడు కిలో మీటర్ల దూరం వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వచ్చింది. జగనన్న పాలనలో ఇంటి దగ్గరకు బియ్యం వ్యానుతో సరుకులు ఇచ్చేవారు.
– గౌడు పోలయ్య, కె కొత్తూరు, పాతపట్నం

#### మా ఊరిలో రేషన్ డిపో లేదు



మా ఊరిలో రేషన్ దుకాణం లేదు. మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న డీలరు ఇంటికి వెళ్లి సరుకులు తీసుకోవాల్సి వచ్చింది. ఉదయం వెళితే ఎక్కువ మంది ఉండటంతో ఒక పూటంతా అక్కడే ఉండిపోయాను. నడుచుకుని వెళ్లి రావాలంటే ఎంతో ఇబ్బందిగా ఉంటుంది. ప్రతీ నెలా మాకీ కష్టాలు తప్పేలా లేవు.
– జాలారి సుంకన్న, రంకిణి, పాతపట్నం

#### వెళ్లి.. వస్తే 16 కిలో మీటర్లు



రేషన్ సరుకులు తీసుకునేందుకు మా ఊరి నుంచి డీలరు వద్దకు వెళ్లి.. తిరిగి ఇంటికి రావాలంటే 16 కిలో మీటర్లు దూరం అవుతుంది. మా ఊరికి పక్కనే రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న రేషన్ డిపోలో సరుకులు తీసుకునేలా అవకాశం కల్పించాలి. అంత దూరం వెళ్లాలంటే మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు.
– సవర సురేష్, గిరిజనుడు, సూదిరాయిగూడ, ఎల్.ఎన్.పేట

#### గంటల తరబడి వేచివున్నాను



బాబూ ప్రజలు బాధలు ఈ ప్రభుత్వానికి అక్కర్లేదా. ఇదేమి పద్ధతి. హాయిగా ఇంటి వద్దకు రేషన్ బండి వస్తే కొన్ని నిమషాల్లోనే బియ్యం, రేషన్ సరుకులు తీసుకొని వెళ్లిపోయేవాళ్లం. ఇప్పుడు మళ్లీ కష్టాలు మొదటికి వచ్చాయి. గంటలు తరబడి డిపోల వద్ద ఉండాల్సి వస్తుంది. ఉదయం 6 గంటలకు వెళ్లాను.. 11 గంటల వరకు వేచి ఉండాల్స వచ్చింది.
– బోరుబద్ర రమణమ్మ, సత్యవరం, నరసన్నపేట

#### పాత పద్ధతే బాగుంది



ఇప్పటి వరకు అమలు చేసిన పద్ధతే బాగుంది. బియ్యం మా వీధిలోనికి వచ్చి ఇచ్చేవారు. డీలరు వద్దకు వెళ్లి క్యూలో ఉండి బియ్యం తీసుకోవాలంటే కష్టంగా ఉంది. మంచి చేస్తుందని ఈ ప్రభుత్వానికి ఓటు వేస్తే ఇలా బాధలకు గురి చేయడం ఏమీ బాగులేదు. ప్రభుత్వం పునరాలోచన చేయాలి.
– దీర్ఘాశి ధనలక్ష్మి, గొడగల వీధి, నరసన్నపేట

# కూటమిది నయవంచన పాలన



- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**ఎల్.ఎన్.పేట:** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది పాలనలో రేషన్ కష్టాలు మళ్లీ ప్రారంభమైయ్యాయని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. జిల్లాలోని అనేక గ్రామాల్లో రేషన్ డీలర్లు లేరని, పక్క గ్రామాలకు వెళ్లి రేషన్ సరుకులు తీసుకుని రావాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. గిరిజన గ్రామాలకు చెందిన రేషన్‌కార్డుదారులు సుమారు పది కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి ఉంటుందన్నారు. ప్రతీరోజు కూలి పనులు చేసుకునే అనేక మంది రేషన్ సరుకులు కోసం రోజంతా డీలర్ల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. లబ్ధిదారులు వెళ్లే సరికి రేషన్ డీలరు అందుబాటులో లేకపోతే మరోసారి వెళ్లాల్సి వస్తోందన్నారు. ఆదివారం సరుకులు తీసుకునేందుకు వృద్ధులు, మహిళలు రోజంతా వేచి ఉండలేక, అంతంత దూరం నడిచి వెళ్లలేక ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రేషన్ కష్టాలను గుర్తించి, ఇంటి వద్దకే సరులు అందివ్వాలని తీసుకువచ్చిన బియ్యం పంపిణీ వాహన వ్యవస్థను రూపు మాపేందుకు కూటమి ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పాత పద్ధతిలోనే సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

# సేవలే గుర్తింపునిస్తాయి


ఉద్యోగ విరమణ పొందిన హెచ్‌ఎం తులసీరావును సత్కరిస్తున్న సత్యనారాయణ

**సరుబుజ్జిలి:** వృత్తిపై అంకితభావం ఉన్నవారికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, విజయనగరం జిల్లా పార్లమెంట్ పరిశీలకులు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ తెలిపారు. పురుషోత్తపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన తులసీరావు సన్మాన కార్యక్రమానికి ఆదివారం హాజరయ్యారు.

స్థానిక పాఠశాల ఆవరణలో హెచ్‌ఎంను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పైడి నర్సింహప్పారావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### వెన్నుపోటు దినం విజయవంతం చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**ఎల్.ఎన్.పేట:** ఈ నెల 4వ తేదీన నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, జెడ్పీటీసీ కిలారి త్రినాథులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శిమ్మ సాంబశివరావు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సూపర్ సిక్స్ హామీల పేరుతో ప్రజలకు మోసం చేసిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు తెలియజేస్తామన్నారు. పార్టీ నాయకులు రెడ్డి రామారావు, లోచర్ల మల్లేశ్వరరావు, పెద్దకోట రాము, ఈగల చిన్నారావు, కొల్ల కృష్ణ, చెట్టు రాము, బలగ గోవిందరావు, కొల్ల లక్ష్మునాయుడు, కాగాన సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

### వెన్నుపోటు చంద్రబాబు నైజం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**కొత్తూరు:** సీఎం చంద్రబాబు రాజకీయ జీవితం వెన్నుపోటుతోనే మొదలైందని కొత్తూరు ఎంపీపీ సవర సావిత్రి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు అన్నారు. స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడటం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఈ నెల 4 తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. పార్టీ నాయకులు దూలి అప్పన్న, అగతమూడి నాగేశ్వరరావు, సేపాన అశోక్, సవర రమేష్, తులాల తులసి, గణేష్, తదితరులు పాల్గొన్నారు

# ప్రజలకు కూటమి వెన్నుపోటు


గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్, నాయకులు

- 4న ప్రశాంతంగా నిరసన కార్యక్రమాలు

**నరసన్నపేట:** ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలు అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ద్వంద వైఖరి చూపుతోందని, హామీలు నెరవేర్చకుండా ప్రజలందరికీ ఎన్నుపోటు పొడిచిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఇచ్చిన హామీలు ఏడాది కాలంలో నెరవేర్చనందుకు నిరసనగా ఈ నెల 4వ తేదీన నియోజకవర్గ కేంద్రాల్లో 'వెన్నుపోటు దినం' పేరిట నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించి గోడ పత్రికను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వ ప్రజాస్వామ్య విలువలను పక్కన పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తుందని విమర్శించారు. కూటమి పాలనలో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలు, మోసాలు, అరాచకాలపై నిరసన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, పార్టీ నాయకులు కరిమి రాజేశ్వరరావు, ముద్దాడ బైరాగినాయుడు, నక్క తులసీదాస్, కణిత కృష్ణారావు, చింతు రామారావు, కనుసు సీతారాం, దోమ మన్మథరావు, లుకలాపు రవి, డోల సాయి, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

# వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ


వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

**ఆమదాలవలస:** సూపర్ సిక్స్ పథకాల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఈ నెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. పట్టణంలోని కొత్తకండ్రపేట జంక్షన్ వద్ద నుంచి ప్రధాన రహదారిపై నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు. ఆ రోజు ఉదయం 9.30 గంటల కల్లా అన్నివర్గాల ప్రజలు, పార్టీ శ్రేణులు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సరుబుజ్జిలి జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, ఆమదాలవలస పట్టణం, పొందూరు, బూర్జ మండలాల పార్టీ అధ్యక్షులు పొడుగు శ్రీనివాసరావు, కొంచాడ రమణమూర్తి, ఖండాపు గోవిందరావు, కర్నేని నాగేశ్వరరావు, ఆమదాలవలస పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ సత్యప్రసాద్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కింజరాపు సురేష్, వైస్ ఎంపీపీలు వండాన సూరపునాయుడు, కరణం కృష్ణమూర్తినాయుడు, మానుకొండ వెంకటరమణ, మాజీ కౌన్సిలర్లు బొడ్డేపల్లి అజంతాకుమారి, దుంపల శ్యామలరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# నరకయాతన

- అధ్వానంగా రహదారులు
- రాకపోకలకు అవస్థలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


ముద్దాడపేట తొగరాం రహదారిలో కలివరం సమీపంలో రహదారి


పురుషోత్తపురం నుంచి ఆమదాలవలస వెళ్లే రహదారిలో పొన్నాంపేట వద్ద దుస్థితి

**సరుబుజ్జిలి:** గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు కోట్లాది రూపాయల నిధులు కుమ్మరిస్తున్నామని చెబుతున్న పాలకులు ఆచరణలో మాత్రం చిత్తశుద్ధి చూపలేకపోతున్నారు. సదుపాయాలు లేక గ్రామీణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, ఆమదాలవలస మండలాల్లో సుమారు 230 గ్రామాలకు సంబంధించి దాదాపు 157 కిలో మీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రహదారులు 49, పీఆర్ 18, మిగిలినవి పీఎంజీఎస్‌వై రహదారులున్నాయి. వీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాలు, వరదల సమయంలో గండ్లు పడి రెండు, మూడు రోజులు రాకపోకలు స్తంభించిపోతున్నాయి.

| ఆమదాలవలస నియోజకవర్గంలో రహదారుల వివరాలు.. | | |
|---|---|---|
| మండలం | ఆర్‌అండ్‌బీ రోడ్లు | పీఆర్ రోడ్లు |
| సరుబుజ్జిలి | 08 | 03 |
| బూర్జ | 12 | 04 |
| పొందూరు | 13 | 05 |
| ఆమదాలవలస | 16 | 07 |

**బాగుపడని రహదారులు..**

చిన్న, చిన్న గ్రామాల మధ్య సంబంధాలను మెరుగుపరిచే వాటిని అంతర్ రహదారులు అంటారు. కుగ్రామాలకు పోవాలంటే చుట్టూ తిరిగి ప్రయాణించకుండా తక్కువ దూరంలో లింక్ రోడ్ల ద్వారా ప్రజలు ప్రయాణాలు చేయవచ్చు. అంతర్ రహదారులు మరమ్మతుల విషయంలో అధికార యంత్రాంగాలు అంతగా శ్రద్ధ చూపకపోవడం వలన అధ్వానంగా తయారయ్యాయి.

**మరమ్మతులు నామమాత్రం..**

ఏడాదికి ఒక్కసారి చేపట్టిన రహదారులు మరమ్మతులు కాంట్రాక్టర్ల జేబులు నింపుతున్నాయే తప్ప.. ప్రజలకు ఎటువంటి ప్రయోజనంలేదు. పర్యవేక్షణ లేకుండా పనులు చేయడం వలన అవి మూనాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. రహదారులపై రాళ్లుతేలి నడవడానికి కూడా ఇబ్బంది పడాల్సివస్తోంది. రహదారుల సమస్యలపై పలుమార్లు అధికారులకు అందించిన వినతులు బుట్టదాఖలు చేశారే తప్ప.. సమస్యలు పరిష్కరించలేదు. దీనివలన రహదారులు వాటి రూపాలను కోల్పోతున్నాయి.

**బురదమయం..**

మండలంలో ప్రధాన రహదారి నుంచి బుడ్డివలస, వ్యాసులుపేట, బప్పడాం, చినమతలబుపేట, తదితర గ్రామాల రహదారులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాలు సమయంలో నీరు నిల్వ చేరి బురద గుంటలను తలపిస్తున్నాయి.

#### ప్రధాన రహదారి దారుణం



అలికాం-బత్తిలి రహదారిలో పోలీస్ స్టేషన్ నుంచి పెట్రోల్ బంక్ వరకు రహదారిలో ప్రజలు నరక యాతన పడుతున్నారు. సరుబుజ్జిలి నుంచి పాలకొండకు వెళ్లే రహదారి పూర్తిగా మురికి గుంతలా మారింది.
– ఇల్లాకుల సూర్యప్రకాశ్, సరుబుజ్జిలి

#### రహదారులను బాగు చేస్తాం

పనులన్నింటి కోసం ప్రతిపాదనలు పంపించాం. పెండింగ్‌లో ఉన్న రహదారి పనులు పూర్తిచేస్తాం. రహదారి మరమ్మతులు కూడా చేపడతాం.
– అంజనేయనాయక్, ఆర్‌అండ్‌బీ జేఈ, సరుబుజ్జిలి

### కల్యాణం.. కమనీయం

**పాతపట్నం:** మండల కేంద్రంలోని మహేంద్ర తనయ నదీ తీరాన ఉన్న నీలంతేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం జ్యేష్ఠ శుద్ధ షష్ఠి (శీతల షష్ఠి) నిర్వహించారు. పార్వతీ, ఈశ్వరుల కల్యాణం నిర్వహించారు. సామూహిక లక్ష కుంకుమార్చనలో అధిక సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేసినట్లు ఈఓ వాసుదేవరావు తెలిపారు.

### క్రీడలతో ఉజ్వల భవిష్యత్


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

**ఆమదాలవలస:** క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్ కలుగుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో సీఎంసీసీ ఎమ్మెల్యే కప్ విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. విజేతగా నిలిచిన నరసన్నపేట టీమ్‌కు రూ.30 వేల నగదు, ట్రోఫీ, రన్నర్‌గా నిలిచిన సిక్కోలు చీటా టెక్కలి టీమ్‌కు రూ.20 వేల నగదు, ట్రోఫీలు అందించారు. సీఎంసీసీ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.